## క్లుప్తంగా

### నగదు అందజేత



పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న లక్ష్మి గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శాశ్వత ఉభయ పూజకు ధనుష్ శ్రీనివాస్, భవానివర్ష దంపతులు రూ.10,116 నగదును దేవస్థానం నిర్వాహక కమిటీ కార్యదర్శి వాకాటి శ్రీనివాసులురెడ్డికి శుక్రవారం అందజేశారు. ప్రతి ఏడాది ఫిబ్రవరి 12న వీరి గోత్రనామాలపై ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని కమిటీ కార్యదర్శి ఈ సందర్భంగా తెలిపారు. ఈనెల 12 నుంచి 18వ తేదీ వరకు దేవస్థాన వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో ఎం.శ్యామ్‌ప్రసాద్, చొప్పా వెంకటేశ్వర్లు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశానికి దరఖాస్తులు

కోవూరు : ప్రైవేటు పాఠశాలల్లో ఆర్థికంగా వెనుకబడిన పిల్లల కోసం ఒకటో తరగతిలో ఉచిత అడ్మిషన్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈఓ రహీమ్ తెలిపారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఒకటో తరగతిలో 25 శాతం ఉచిత అడ్మిషన్లు పొందేందుకు రెండో విడత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఈనెల 6 నుంచి 15వ తేదీ వరకు ప్రభుత్వం గడువు ఇచ్చినట్లు తెలియజేశారు. 16 నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన జరిపి 22న లాటరీ ద్వారా అర్హుల ఎంపిక జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### టెంకాయ చెట్టుపై పిడుగుపాటు

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షం కురిసింది. దీంతో మినగల్లు గ్రామానికి చెందిన పుట్టు రమణయ్య ఇంటికి సమీపంలో ఉన్న టెంకాయ చెట్టుపై పిడుగు పడటంతో చెట్టు దగ్ధమైంది. అదే సమయంలో జోరు వర్షం కురవడంతో నిప్పులు చల్లారిపోయాయి. అయితే ఇంటి పైకప్పు నల్లగా మారి స్వల్పంగా దెబ్బతింది.

### నేడు కృష్ణపట్నంకు మంత్రి కాకాణి రాక

ముత్తుకూరు : 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మండలంలోని కృష్ణపట్నం పంచాయతీలో శనివారం నిర్వహించనున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి హాజరుకానున్నారని చెప్పారు.

**పొదలకూరుకు రాక**

పొదలకూరు : పట్టణంలోని నెల్లూరు రోడ్డులో ఓ కల్యాణ మండపాన్ని ప్రారంభించేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం ఉదయం 11 గంటలకు పొదలకూరుకు విచ్చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి తెలిపారు. మేనేజ్‌మెంట్ మారినందున తిరిగి మండపాన్ని మంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు.

### గంజాయి విక్రయాలపై దాడులు



నెల్లూరు(క్రైమ్): నగరంలో గంజాయి విక్రయాలపై ఎస్‌ఈబీ అధికారులు శుక్రవారం దాడులు చేసి ఐదుగుర్ని అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఎస్‌ఈబీ నెల్లూరు -1 స్టేషన్లో స్థానిక ఇన్‌స్పెక్టర్ కిశోర్ వెల్లడించారు. కపాడిపాళెంలో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయని సమాచారం అందడంతో నిఘా ఉంచారు. పక్కా సమాచారంతో కపాడిపాళెంలోని రాయపువారి వీధిలో దాడులు చేశారు. గంజాయి విక్రయదారులైన వెంగళరావునగర్‌కు చెందిన తిరుమల, కోడూరుపాడుకు చెందిన ఓ.మ్రేష్ అలియాస్ చిన్నా, సుభానీ, వినియోగదారులైన నెల్లూరు రూరల్ మండలం దొరతోపు కాలనీకి చెందిన రవితేజ అలియాస్ సాయి, సంజయ్‌ను అరెస్ట్ చేశారు. వీరి నుంచి రెండు కిలోల గంజాయి,ఐదు సెల్‌ఫోన్లు, కేటీఎం డ్యూ క్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నానికి చెందిన గంజాయి సరఫరాదారుడ్ని అరెస్ట్ చేయాల్సి ఉందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

### పోక్సో కేసులో విచారణ

నెల్లూరు(క్రైమ్): వైఎస్సార్‌నగర్‌లో ముగ్గురు బాలికలపై వికృత చేష్టలకు పాల్పడిన ఇద్దరిపై పోక్సో కేసును వేదాయపాళెం పోలీసులు నమోదు చేశారు. ఘటనపై ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసులో విచారణను త్వరితగతిన పూర్తి చేసి నిందితులను అరెస్ట్ చేయాలని దిశ డీఎస్పీ సురేష్‌బాబును ఆదేశించారు. దీంతో ఘటన స్థలం, బాధితుల ఇళ్ల వద్ద డీఎస్పీ విచారణ చేపట్టారు. స్థానికుల నుంచి వివరాలను సేకరించారు.

# వైఎస్సార్‌సీపీ విజయదుందుభి ఖాయం



కృష్ణపట్నంలో మహిళకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు : 2024 ఎన్నికల్లో 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయదుందుభి ఖాయమని రాష్ట్ర వ్యవసాయ–సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని కృష్ణపట్నం పంచాయతీలో శుక్రవారం జరిగిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇల్లిల్లూ తిరిగి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు, గ్రామాల అభివృద్ధి వల్ల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని తెలియజేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మొక్కుబడిగా కాకుండా ప్రజలు వెలిబుచ్చిన ప్రతి సమస్యను నమోదు చేసుకొని, వాటిని పరిష్కరిస్తూ గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. ఈ నాలుగేళ్ల పాలనలో కృష్ణపట్నం గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణానికి రూ.1.75 కోట్లు విడుదల చేశామని, సైడు డ్రెయిన్లకు రూ.1.40 కోట్లు విడుదల చేశామని చెప్పారు. గతంలో ఏ శాసనసభ్యుడు చేయని విధంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా అమలు చేయని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో పేదలకు అందుతున్నట్లు వెల్లడించారు. మత్స్యకారుల కోసం రూ.25 కోట్లతో ఫిషింగ్ జెట్టీ నిర్మాణం త్వరలో ప్రారంభమవుతుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతంలో శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. సీఎస్సార్ నిధుల ద్వారా ఫిషింగ్ జెట్టీ నిర్మాణం జరుగుతుందన్నారు. తొలుత కృష్ణపట్నం గ్రామానికి వచ్చేసిన మంత్రి కాకాణికి పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధనరెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, మండల ఉపాధ్యక్షుడు పోలిరెడ్డి చిన్నపరెడ్డి, ఉపసర్పంచ్ రాగాల వెంకటేశ్వర్లు, నేతలు పెద్దపాళెం సుబ్బయ్య, పసుపులేటి గోవిందు, రాగాల కోదండ రామయ్య, పెదపాళెం హరి, ఉదయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భూసార పరీక్షలతో అధిక దిగుబడులు

- ఏఓ గీతాకుమారి



భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న ఏఓ

తోటపల్లిగూడూరు : వరిసాగుకు సంబంధించి భూసార పరీక్షలు చేయించుకోవడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి గీతాకుమారి సూచించారు. మండలంలోని నరుకూరు రైతు భరోసా కేంద్రంలో రైతులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం జరిగింది. అనంతరం స్థానిక పంట పొలాల్లో మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్షలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ వ్యవసాయంలో భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. నేలల్లో సహజంగా ఉన్న పోషక పదార్థాలతో పాటు అదనంగా వేసిన సేంద్రియ ఎరువులు, రసాయన ఎరువుల్లోని పోషకాలు మొక్కలకు దోహదపడి అధిక దిగుబడులకు ఊతమవుతాయన్నారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగాన్ని చేపట్టవచ్చని, తద్వారా అనవసరపు ఖర్చులను తగ్గించుకోవచ్చని తెలిపారు. వీటితో పాటు రైతులు వేయదలిచిన పంటలకు నత్రజని, భాస్వరం, పోటాష్, సూక్ష్మపోషక ఎరువుల మోతాదును సూచిస్తామన్నారు. అలాగే సమస్యాత్మక భూముల్లో ఆమ్ల, క్షార భూములను గుర్తించవచ్చన్నారు. అనంతరం పంట పొలాల్లో భూసార పరీక్షలు నిర్వహించి మట్టి నమూనాలను సేకరించారు. కార్యక్రమంలో వీఆర్వో సురేంద్ర, సచివాలయ వ్యవసాయ సహాయకులు నిరూష, ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

## పొదుపు గ్రూపు వివరాల నమోదుకు 'లోకోస్'

- ఏపీఎం రుక్మిణి



పొదుపు సంఘాలకు శిక్షణ ఇస్తున్న ఏపీఎం

కొడవలూరు : పొదుపు గ్రూపుల సమగ్ర వివరాల నమోదుకు 'లోకోస్' యాప్‌ను వినియోగించాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ఎస్.రుక్మిణి సూచించారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో పొదుపు సంఘాల సభ్యులకు లోకోస్ యాప్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా లోకోస్ యాప్‌ను ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. ఈ యాప్‌లో పొదుపు గ్రూపుల, సభ్యుల, సంఘ బంధాల సమగ్ర వివరాలు నమోదు చేయాల్సి ఉందని చెప్పారు. ఈ యాప్ ఈనెల 15 నుంచి అందుబాటులోకి రానుందని తెలిపారు. పొదుపు సంఘాలు ఎప్పుడు ఆవిర్భవించాయి, ఇప్పటి వరకు ఏఏ పథకాలను సద్వినియోగం చేసుకున్నారు.. తదితర వివరాలను యాప్‌లో నమోదు చేయాల్సి ఉందన్నారు. ఆర్థిక వివరాలను మాత్రం నమోదు చేయరాదని చెప్పారు. ఇందుకు సంబంధించి త్వరలోనే కేంద్రం నుంచి స్పష్టత వచ్చాక ఆర్థిక వివరాలను ఎలా నమోదు చేయాలో శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో సంఘ మిత్ర అధ్యక్ష, కార్యదర్శులు కోటేశ్వరమ్మ, సుశీల, కోశాధికారి ప్రవీణ, సీసీలు ఉదయ్, శ్రీదేవి, మమత, శోభ, పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ కవర్ల నిషేధానికి స్పెషల్ డ్రైవ్



వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న నగర పంచాయతీ సిబ్బంది

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చి నగర పంచాయతీ పరిధిలో ప్లాస్టిక్ కవర్ల నిషేధానికి శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ కార్యాలయ సిబ్బంది పట్టణంలోని పలు దుకాణాలు, చేపల మార్కెట్, పూలు, పండ్ల వ్యాపారులు, వివిధ వ్యాపార యజమానుల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ కవర్ల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి దుకాణం వద్దకు వెళ్లి ప్లాస్టిక్ కవర్లను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల ప్రాణాంతకమైన వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, దీనిని గుర్తించి ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలని సూచించినట్లు వివరించారు.

## కల్యాణం.. కమనీయం



వేడుకగా జరుగుతున్న ప్రసన్న విశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవం

ఇందుకూరుపేట : మండలంలోని మైపాడులో కొలువైన అన్నపూర్ణాంబ సమేత ప్రసన్న విశ్వేశ్వరుని కల్యాణోత్సవం శుక్రవారం కమనీయంగా సాగింది. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి వేదికపై కొలువుదీర్చారు. ఆలయ అర్చకుడు బండారు ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు వేడుకను జరిపించారు. ఉభయదాతలుగా స్థానికుడు గంపల రామసుబ్బయ్య, వారి కుమారులు వ్యవహరించారు. రాత్రి గజవాహనోత్సవం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కనుపూరు సురేంద్రబాబు, ఈఓ శ్రీనివాసరావు, ధర్మకర్తలు ఉడతా సుజిత, కూనంగారి రాజమ్మ, తోట సుధీర్, సంగం శ్రీనివాసులు, కొరుటూరు అశ్విని, కొమరిక పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

**కొమరికలో..**



చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం

కొమరికలోని శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా సాగింది. ఆలయ అర్చకుడు తులసీరాం స్వామి ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. రాత్రి గజవాహనసేవ జరిగింది. ఆలయ చైర్మన్ ముంగర బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రేపు పడుగుపాడులో గడప గడపకు..

కోవూరు : మండలంలోని పడుగుపాడు వాగుమిట్ట ప్రాంతంలో ఆదివారం ఉదయం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం జరుగుతుందని డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి శుక్రవారం తెలిపారు. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొంటారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

### అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తోటపల్లిగూడూరు : ఇందుకూరుపేట ఐసీడీఎస్ పరిధిలో ఖాళీగా ఉన్న రెండు అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు సీడీపీఓ హేనాసుజన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తోటపల్లిగూడూరు మండలంలోని మాచర్లవారిపాళెం గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్త, హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉందన్నారు. మాచర్లవారిపాళెం గణపతినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త పోస్టును ఎస్సీ మహిళకు, మాచర్లవారిపాళెం ఈపూరు అంగన్‌వాడీ కేంద్రం ఆయా పోస్టును జనరల్ మహిళకు కేటాయించినట్లు తెలిపారు. ఈ పోస్టులకు సంబంధించి అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణత సాధించి, 21 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. ఈనెల 9వ తేదీలోగా దరఖాస్తులను ఇందుకూరుపేట ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

### నాడు–నేడు పనులు వేగవంతం చేయాలి

కోవూరు : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను వేగవంతం చేయాలని ఏపీఎస్‌డబ్ల్యూఐడీసీ డీఈ శ్రీనివాసకుమార్ అన్నారు. కోవూరు మండల కేంద్రంలో నాడు–నేడు పనులపై శుక్రవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలలకు సంబంధించిన హెచ్‌ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సీఆర్పీలు ప్రతిరోజూ నాడు–నేడు పనులకు సంబంధించిన నివేదికను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఈ మహేంద్ర, ప్రవీణ్, సీఆర్పీలు ఉన్నారు.

### నియామక పత్రాల అందజేత

నెల్లూరు (పొగతోట): జెడ్పీలో పనిచేస్తూ మరణించిన వారి కుటుంబసభ్యులకు ఉద్యోగావకాశాలు కల్పించారు. దీనికి సంబంధించిన నియామక ఉత్తర్వులను జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ శుక్రవారం అందజేశారు. జెడ్పీ సీఈఓ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

# అర్హతే ప్రామాణికంగా సంక్షేమం



మహిళకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని లేబూరు గ్రామంలో శుక్రవారం ఆయన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ నేరుగా వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల వివరాలను లబ్ధిదారులకు తెలిపారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అని ఆరాతీశారు. అనంతరం ప్రసన్న మాట్లాడుతూ కుల, మత, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను నేరుగా అర్హుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు వెల్లడించారు. ఇన్ని సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రి ఇప్పటి వరకు దేశంలోనే లేరని కొనియాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కోవూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 58 సచివాలయాల పరిధిలో 68,297 గడపలకు తిరిగినట్లు తెలియజేశారు.

**వాటర్‌ప్లాంట్ ప్రారంభం**

లేబూరు గ్రామంలో వాటర్‌ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రారంభించారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ నిధులు రూ.5 లక్షలు, నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డికి సంబంధించి రూ.2 లక్షలతో కలిపి మొత్తం రూ.7 లక్షల నిధులతో వాటర్‌ప్లాంట్‌ను నిర్మించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్బయ్య, ఎంపీడీఓ కె.నాగేంద్రబాబు, నేతలు గూడూరు ప్రభాకర్‌రెడ్డి, షబ్బీర్, టి.మల్లికార్జునరెడ్డి, బాబయ్య, సదాశివారెడ్డి, కృష్ణమనాయుడు, సర్పంచ్ సుమతి, మాజీ సర్పంచ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## భారతి సిమెంట్‌తో గట్టి నిర్మాణాలు



ప్రమాద బీమా పత్రాలను అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు

బుచ్చిరెడ్డిపాళెం : భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్‌తో దృఢమైన కట్టడాలను నిర్మించవచ్చని సంస్థ టెక్నికల్ ఆఫీసర్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని మదీన ట్రేడర్స్‌లో తాపీమేస్త్రీలతో శుక్రవారం అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్ అత్యాధునిక టెక్నాలజీతో తయారు చేసింది కాబట్టి మార్కెట్‌లో దొరికే ఇతర సిమెంట్ల కన్నా తక్కువ సమయంలో సెట్టింగ్ పూర్తవుతుందని తెలిపారు. భారతి సిమెంట్ నాణ్యత గురించి వినియోగదారులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తామని తెలియజేశారు. అనంతరం తాపీమేస్త్రీలకు రూ.లక్ష విలువ చేసే బీమా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సేల్స్ ఆఫీసర్ కె.మణికుమార్, మదీనా ట్రేడర్స్ డీలర్ జావీద్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ప్రసన్న ఆపన్నహస్తం

- రూ.1.20 లక్షల సాయం అందజేత



బాండ్లు అందుకున్న కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట : మండలంలోని కొత్తూరు గ్రామంలో తండ్రి లేని ఆరుగురు చిన్నారులకు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆపన్నహస్తం అందించారు. నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.1.20 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ నగదును చిన్నారుల పేరు మీద రూ.20 వేల చొప్పున బ్యాంక్‌లో డిపాజిట్ చేయించి బాండ్లను శుక్రవారం కుటుంబ సభ్యులకు లేబూరులో జరిగిన ఓ కార్యక్రమంలో అందజేశారు. కార్యక్రమంలో నేతలు మావులూరు శ్రీనివాసులురెడ్డి, గొల్లపల్లి విజయ్‌కుమార్, కైలాసం శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 7న హైవే విస్తరణకు భూమిపూజ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఏఏబీ చైర్మన్

కోవూరు : మండల పరిధిలోని పడుగుపాడు వద్ద జాతీయ రహదారి విస్తరణ పనులకు సంబంధించి 7వ తేదీన ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి భూమి పూజ చేయనున్నారని డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి తెలిపారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను పడుగుపాడులో శుక్రవారం ఆయన పరిశీలించారు. ఇనమడుగు సెంటర్ నుంచి వెంకటేశ్వరపురం జాతీయ రహదారి విస్తరణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయన్నారు. ఆయన వెంట పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, ఉపసర్పంచ్ అహ్మద్, మండల సచివాలయాల కన్వీనర్ ప్రసాద్, చిరంజీవి, పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి, ఆర్అండ్‌బీ అధికారులు ఉన్నారు.

## గుర్తుతెలియని యువకుడి మృతి



నెల్లూరు(క్రైమ్) : గుర్తుతెలియని యువకుడు మృతి చెందిన సంఘటన వెంకటేశ్వరపురం ఫ్లైఓవర్ సమీపంలోని రైలు పట్టాల వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. మృతుడు 35 నుంచి 40 ఏళ్లలోపు వయస్సు కలిగి, బ్లూ రంగు ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, బ్లూ నైట్ ప్యాంట్‌ను ధరించి ఉన్నారు. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై హరిచందన ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఎలాంటి వివరాలు లభ్యం కాకపోవడంతో మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నెల్లూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని ఆమె కోరారు.

## గ్రూపుగా ఇళ్ల నిర్మాణాలు చేసుకుంటే మేలు

- ట్రైయినీ కలెక్టర్ విద్యాధరి



కొడవలూరు : తాటాకులదిన్నె లేఅవుట్‌లో లబ్ధిదారులకు సూచనలిస్తున్న ట్రైయినీ కలెక్టర్



బుచ్చిరెడ్డిపాళెం : మాట్లాడుతున్న కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

కొడవలూరు : గృహ లబ్ధిదారులు గ్రూపుగా ఇళ్ల నిర్మాణాలు చేసుకుంటే ప్రయోజనకరమని ట్రైయినీ కలెక్టర్ జి.విద్యాధరి సూచించారు. మండలంలోని తాటాకుల దిన్నె, కొడవలూరు దర్గా సంఘంలోని జగనన్న లేఅవుట్‌లను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా తాటాకుల దిన్నెలో 13 మంది గిరిజన లబ్ధిదారులు గ్రూపుగా ఏర్పడి శ్రమ తోడ్పాటునందించుకోవడం ద్వారా ఇంటి నిర్మాణాలు చేపడుతుండడాన్ని ఆమె గుర్తించారు. ఈ సందర్భంగా ఆమె వారికి పలు సూచనలు చేశారు. లబ్ధిదారులు గ్రూపుగా ఏర్పడి ఒకరికొకరు శ్రమ తోడ్పాటు అందించుకోవడం ద్వారా నాణ్యతతో పాటు ప్రభుత్వ నిధులతోనే ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవచ్చని చెప్పారు. ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షలు ఇవ్వడంతో పాటు పొదుపు ద్వారా మరో రూ.35 వేల రుణం ఇస్తోందన్నారు. ఒక్కో లబ్ధిదారుకు రూ.2.15 లక్షలు వస్తున్నందున లబ్ధిదారుల శ్రమ తోడైతే తక్కువ వ్యయంతోనే నాణ్యంగా ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవచ్చని చెప్పారు. అనంతరం కొడవలూరు దర్గా సంఘంలోని జగనన్న లేఅవుట్‌ను ఆమె పరిశీలించి అక్కడ ఐదుగురు గిరిజన లబ్ధిదారులుండగా, వారిలో ఒక్కొక్కరికి రూ.10 వేల వంతున ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సాయాన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు తాటాకుల దిన్నెలోని గిరిజనుల వలె గ్రూపుగా శ్రమ తోడ్పాటునందించుకొని ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఆమె వెంట ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, ఈఓపీఆర్డీ వి.నాగరాజు, హౌసింగ్ ఏఈ పి.సురేష్‌కుమార్, సర్పంచ్ మారంరెడ్డి రంగారెడ్డి, ఇంజినీరింగ్ సహాయకులు రామకృష్ణ, శ్యామ్, పంచాయతీ కార్యదర్శి జి.రాధాకృష్ణ ఉన్నారు.

**నిర్మాణాల పురోగతిపై దృష్టి పెట్టండి**

బుచ్చిరెడ్డిపాళెం : జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలపై సంబంధిత అధికారులు, ఇంజినీర్ అసిస్టెంట్లు ప్రత్యేక దృష్టి సారించాలని బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో హౌసింగ్ శాఖ అధికారులు, ఇంజినీర్ అసిస్టెంట్లతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణ విషయంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని, ఇందులో భాగంగా ప్రతిరోజు పురోగతి వివరాలను పంపాలని సూచించారు. బుచ్చి రూరల్ పరిధిలో ఇళ్ల నిర్మాణాలు కాస్త మెరుగ్గా ఉన్నప్పటికీ అర్బన్ ప్రాంతంలో పురోగతి లేదని తెలిపారు. ఈ విషయంలో సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని లబ్ధిదారులతో పాటు కాంట్రాక్టర్లకు అవగాహన కల్పించాలని తెలియజేశారు. గడువులోపు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ గౌస్‌మొహిద్దీన్, ఇంజినీర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.